చివరి దశకు ఎస్‌టీపీ పనులు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూలై 8: మూసీ నది ప్రక్షాళనలో భాగంగా మురుగునీటి శుద్ధికోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న ఎస్‌టీపీ పనులు చివరి దశకు చేరుకున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ పరిధి ఫతుల్లాగూడలో రూ. 450 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఎస్‌టీపీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మొట్ట మొదటిసారిగా ఎస్‌బీఆర్ (సీక్వెన్సార్ బ్యాక్ రియాక్టర్) టెక్నాలజీతో నిర్మిస్తున్న ఎస్‌టీపీ ద్వారా రోజుకు 320 ఎంఎల్‌డీ మురుగునీటిని శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో తాను మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు గతేడాది మార్చి 17న పనులకు శంకుస్థాపన చేశానని తెలిపారు. జంటనగరాల్లో దక్షిణం వైపున ఉన్న బాపూఘాట్ నుంచి వచ్చే మురుగునీరు నయాపూల్ గుండా ఇప్పుడు నిర్మిస్తున్న ఎస్‌టీపీలోకి చేరుకుంటాయని తెలిపారు. మురుగునీటిని ఇక్కడ శుద్ధి చేసి మూసీలోకి వదలడం జరుగుతుందన్నారు. నెల రోజుల్లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్లాంట్‌ను ప్రారంభించడానికి అధికారులు సన్నాహాక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, సతీశ్‌యాదవ్, మధుసాగర్, వివిధ శాఖల అధికారులు రాజ్‌కుమార్, రజనీకాంత్, రమేశ్, నవీన్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫతుల్లాగూడలో నిర్మిస్తున్న ఎస్‌టీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వైఎస్ఆర్‌కు నివాళి

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 8: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా కొత్తపేట చౌరస్తాలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ధర్మకర్త మధుసాగర్, నాగరాజు, విజయ్, జహంగీర్, శశి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మలక్‌పేట, జూలై 8: మూసీ పరీవాహక ప్రాంతం పొడవునా ఉన్న పాత మలక్‌పేట డివిజన్‌లో అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని వాహెద్‌నగర్, తీగలగూడ, అష్జల్‌నగర్, బంజారా బస్తీ కాలనీల్లో ఎంటమాలజీ సిబ్బంది సోమవారం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. లార్వా నివారణకు మురికినీటి కాలువలు, గుంతల్లో లార్వా నిర్మూలన మందులను పిచికారి చేశారు. కాలనీల్లో అపరిశుభ్రతకు తావులేకుండా పారిశుధ్యం చేయించారు. వారానికోసారి ఫాగింగ్, రెండు వారాలకోసారి లార్వా నిర్మూలన రసాయనాలను పిచికారి చేయిస్తున్నట్లు డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఎల్బీనగర్, జూలై 8: ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కార్యాలయం ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీపీ ప్రసాద్ ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన వారితో ఫిర్యాదులు స్వీకరించారు. జోనల్ కార్యాలయం ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు రాగా అందులో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4, యూబీడీ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

హయత్‌నగర్ సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య ఫిర్యాదులను స్వీకరించారు. సర్కిల్‌లో మొత్తం నాలుగు ఫిర్యాదులు అందగా వాటిలో ఇంజినీరింగ్ విభాగం నుంచి 2, ఆస్తిపన్ను విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో సర్కిల్‌లోని వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీపీ ప్రసాద్

పాలనను గాలికొదిలేసిన సీఎంకు బుద్ధిచెప్పాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి

ఆర్కేపురం, జూలై 8 : రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల కమిటీ కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆర్కేపురం డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకించిన కాంగ్రెస్ వాళ్లే ఇప్పుడు నాయకుల ఇంటివద్దకు వెళ్లి పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఒక పార్టీమీద గెలిచి వేరొక పార్టీలోకి వెళ్తే రాళ్లతో కొట్టండి అని అన్న రేవంత్‌రెడ్డిని ఇప్పుడు ఏ రాళ్లతో కొట్టాలని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టిపెట్టి హామీలను అమలుచేసేందుకు కృషి చేయాలన్నారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలనలో రాష్ట్రం కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కన్నా ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఇతర పార్టీల గుర్తు మీద గెలిచిన వారిని కాంగ్రెస్ పార్టీలోకి రావాలని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని కూనిచేయడమేనని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనపై దృష్టిపెట్టాలని కోరారు. శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, రమేశ్ కురుమ తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీ వారాహి దేవి నవరాత్రులు

ఆర్కేపురం, జూలై 8 : ఆర్కేపురంలోని కుర్తాళం పీఠ శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ వారాహి దేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుంటున్నారు. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, పారాయణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఎమ్మెల్సీ వాణీదేవి, చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావు కుటుంబానికి కుర్తాళం పీఠంతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి మహామంత్రస్వరూపులని, నేటితరం నడిచే దైవమని తెలిపారు. ఆలయ సెక్రటరీ మునిపల్లి శ్రీనివాస్ ఎమ్మెల్సీకి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణాపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, వెంకటేశ్వర్లు, విఠల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, అరుణ ఉన్నారు.

ఎమ్మెల్సీ వాణీదేవికి అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్

చైతన్యపురి కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఎల్బీనగర్, జూలై 8: చైతన్యపురి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లె కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో పాటుగా ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. చైతన్యపురి కాలనీలో ప్రధాన రోడ్డులో తరుచుగా డ్రైనేజీ లీకేజీ అవుతుందని, చైతన్యపురి రెండో బస్టాపు ఉండి ఎస్‌వీ టవర్స్ వరకు డ్రైనేజీ లైన్ మంజూరైనా కేవలం బాబు కాంప్లెక్స్ వరకు మాత్రమే డ్రైనేజీ లైన్ వేయడంతో మురుగునీరు రోడ్లపై పారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ జలమండలి జీఎం బాలరామరాజుకు వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా సీవరేజీ లైన్ల నిర్మాణంతో అస్తవ్యస్తంగా మారిన రోడ్లను వెంటనే బాగు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి, సరూర్‌నగర్ ఉప కమిషనర్ సుజాతలకు కూడా చైతన్యపురి కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు కోరారు. చైతన్యపురి కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి జవ్వాది రామారావు, కోశాధికారి చెన్నయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌పీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి

సమస్యల పరిష్కారానికి కృషి

కందుకూరు, జూలై 8 : ప్రజలు తనకు సేవ చేసే అదృష్టం కల్గించారని, వారికి నిరతంరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు బీఆర్ఎస్ నాయకుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పదవీ కాలం పూర్తి చేసుకోవడంతో కందుకూరు గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయనను పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా ఉంటానని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యదర్శి సురేందర్ గౌడ్, సిద్ధేశ్వర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాజశేఖర్‌డ్డిని సన్మానిస్తున్న సురేందర్‌గౌడ్, పంచాయతీ సిబ్బంది

హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

కందుకూరు, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైనట్లు బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు తెలిపారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా వెజిటేబుల్ కన్వీనరు పల్లె కృష్ణాగౌడ్, జిల్లా కార్యదర్శి కొంతం జంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు, రుణాలను పొందిన ప్రతి రైతుకు తక్షణమే రుణామాఫీ చేయాలని, అదే విధంగా రైతులు దళారులను ఆశ్రయించకుండా వెంటనే పెట్టుబడి సాయం కింద రూ. 15వేలు ఎకరాకు వారి ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా అమలు చేయాలని, కౌలు రైతులకు రూ. 12వేల 500లను వెంటనే చెల్లించాలని, రైతు కూలీలకు కూడా ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు, రైతులు పండించిన పంటకు క్వింటాలుకు అదనంగా రూ. 500లు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కల్లెం చెన్నారెడ్డి , నల్లబోలు నర్సింహారెడ్డి, కల్లెం సుధాకర్‌రెడ్డి, సురుసాని భూమిరెడ్డి, గంగుల వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఊటు మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్, దేవేందర్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం

అమ్మవారి పూజలో పాల్గొన్న సహదేవ్ యాదవ్ ,ఆలయ కమిటీ సభ్యులు

మాదన్నపేట, జూలై 8: కుర్మగూడ లోని మూడు గుళ్ల మహంకాళి దేవాలయ 18వ వార్షికోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం దేవాలయాన్ని పూలతో అలంకరించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, చండీ హోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు కుసురు సహదేవ్ యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, నర్సింహ, సత్యనారాయణ, మహేశ్ కుమార్, నాగరాజు సురేందర్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు పటిష్ట బందోబస్తు

మాట్లాడుతున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాశ్

సైదాబాద్, జూలై 8 : పాతబస్తీలో బోనాల ఉత్సావాలు, మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపు కునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాశ్ సూచించారు. సోమవారం సాయం త్రం సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని ఆలయ కమిటీ ప్రతినిధులు, మైత్రి, శాంతి సంఘాల ప్రతినిధుల బోనాల, మొహర్రం సన్నాహాక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు, ఘటాల ఊరేగింపు ఉత్సవాలు, మొహర్రం పండుగను పురస్కరించుకొని ప్రత్యేక భద్రతచర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. భారీ బందోబస్తును ఏర్పాటు చేసి పోలీసులు తీసుకొనే చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించి, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు దోహదపడాలన్నారు. అవాంఛనీయ చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించమన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి, ఎసీపీలు వెంకన్న నాయక్, శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, శేఖర్‌రెడ్డి, ఎస్సైలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, మైత్రి, శాంతిసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా నర్సింహారెడ్డి

చల్లా నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్

బడంగ్‌పేట,జూలై8: తెలంగాణ స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (టీయూఎఫ్ఐడీసీ) చైర్మన్‌గా చల్లా నర్సింహారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సింహారెడ్డి జిల్లెగూడ గ్రామ ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌గా, సరూర్‌నగర్ మండల జడ్పీటీసీగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీలో గ్రామ స్థాయి నుంచి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. నియోజక వర్గం పీసీసీ సభ్యులుగా కొనసాగుతున్నారు. చల్లా నర్సింహారెడ్డిని మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ నాయకులు, అభిమానులు బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, కార్పొరేటర్ కవితా బాల్ రెడ్డి, బాలమణి, చల్లా ప్రభాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కీసర యాదరెడ్డి, సుభాశ్ రెడ్డి, విజయ్ రెడ్డి, తదితరులు సత్కరించారు.

అభివృద్ధికి కృషి చేస్తా

నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న జంగారెడ్డి

కందుకూరు, జులై 8 : అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బాధ్యతలను స్వీకరించగా మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలను అప్పగించారని నమ్మకాన్ని వమ్ముచేయనన్నని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఢీల్లి శ్రీధర్ ముదిరాజ్, మదన్‌పాల్ రెడ్డి,ఈర్లపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్, సుభాశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నలుగురు దొంగలు అరెస్ట్, రిమాండ్

బడంగ్‌పేట,జూలై8: నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం...బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ పరిధిలోని శ్రీ మారుతీ నగర్‌కు చెందిన చింతోజ్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. కుర్మగూడ చెందిన గోపాల్ ఆటో డ్రైవర్. స్వరూప నగర్ ఉప్పల్‌కు చెందిన చందు సెంట్రింగ్ పని చేస్తాడు. బీరప్ప గడ్డ ఉప్పల్‌కు చెందిన రాపోల్ శ్రీశైలం అలియాస్ చిన్న లేబర్. మరొకరు బాలనేరస్తుడు. మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బాల నేరస్తుడి పై 9 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నలుగురు కలిసి చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నారు. మీర్‌పేట, హయత్ నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరిపై కేసులు ఉన్నాయి. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నిజం నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వారిని అరెస్టు చేసి విచారించగా నేరాలను ఒప్పుకున్నారని ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 125 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.12లక్షలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట సీఐ నాగరాజు, రాంబాబు ఉన్నారు.

పూరి కుర్మలో పురుగు

సైదాబాద్, జూలై 8 :సైదాబాద్ గడ్డి అన్నారంలోని రాఘవేంద్ర హోటల్‌లో పూరి కుర్మలో పురుగు రావడంతో కంగుతిన్న కస్టమర్ ఏంటని హోటల్ యజమానిని ప్రశ్నించాడు. అతడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటంతో ఈ విషయాన్ని కస్టమర్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. హోటల్ నిర్వాహకులను వివరణ కోరగా పూరి కుర్మలో వచ్చింది పురుగు కాదని, గ్రీన్ ఆలు గడ్డ అని చెప్పటంతో కస్టమర్ తన డబ్బులను వాపసు తీసుకొని వెళ్లాడని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ఎల్బీనగర్, జూలై 8: నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. 2002-2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో వారంతా కలిసి తమ ఉపాధ్యాయులతో పాటుగా నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం (నోసా) ప్రతినిధులను కూడా ఆహ్వానించి కార్యక్రమాన్ని జరుపుకున్నారు. పాఠశాలలోని తమ పాత అనుభవాలను ఒకరికొకరు పంచుకుని ఆనందంగా గడిపారు. ఆట, పాటలతో అలరించారు. ఉపాధ్యాయులు వసుంధర దేవి, బాల నర్సింహ మాట్లాడుతూ నాగోలు పాఠశాల లోని పూర్వ విద్యార్థులంతా తమను గుర్తుపెట్టుకుని ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించడం పై సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగినప్పుడే ఉపాధ్యాయులకు ఆనందమని, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం పై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు డప్పు జగదీశ్వర్, కందికంటి సాయిబాబా మాట్లాడుతూ నాగోలు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించిన తాము వివిధ రంగాల్లో స్థిర పడ్డామని అన్నారు. పూర్వ విద్యార్థులుగా నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నోసా చేస్తున్న కార్యక్రమాల్లో తాము భాగం పంచుకుంటున్నామన్నారు. నోసా కార్యక్రమాలు తమకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. పూర్వ విద్యార్థులు డప్పు జగదీశ్, కందికంటి సాయిబాబా, కల్లు స్వాతిరెడ్డి, రంజిత్‌రెడ్డి, పంగ భీంరాజ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

తరగతి గదిలో వీడియో తీసిన టీచర్

సైదాబాద్, జూలై 8 : తరగతి గదిలో విద్యార్థులను వీడియో తీస్తూ కుటుంబ సభ్యులను కించపర్చే విధంగా దూషించిన సేయింట్ ఆండ్రూ పాఠశాల టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల పేరెంట్స్ సైదాబాద్ జోన్ ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణకు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం రెండున్నర ప్రాంతంలో టీచర్ భారతి తమ పిల్లలను వీడియో తీయటమే కాకుండా తమను అవమాన పర్చే విధంగా మాట్లాడిందని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదును ఉన్నతాధికారులకు పంపించి, తగిన చర్యలు తీసుకుంటామని ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ తెలిపారు.

ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల పేరెంట్స్

ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంకు సత్కారం

చంపాపేట, జూలై 8: ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంను కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమా రెడ్డి సోమవాం తన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మాజీ ధర్మకర్త డేరం ప్లల కృష్ణ, నాయకులు ఎలిమినేటి నిష్కాంత్ రెడ్డి, గూడూరు గౌతంరెడ్డి పాల్గొన్నారు.